# జగన్నాటకం

చల్లచల్లగా ఉంది భాగ్యనగరంలో బాలానగరం పారిశ్రామికవాడలోని ఆ గది.

వేడివేడిగా ఉన్నాడు ఆ గదిలోని తిరుగుడు కుర్చీలోని పరమశివుడు.

పై చల్లదనం లోపలి వేడిని జయించలేకపోతోంది. చేసిన ఆలోచన చెయ్యకుండా చేస్తూ వేడెక్కిపోతున్నాడు పరమశివుడు.

ఈ వైపరీత్యానికి కారణం ఓ శిశు మరణం.

మరణాలు జనాభా నియంత్రణకు ఆభరణాలు – అన్నది ఓ నినాదం చెయ్యాలని పరమ శివుడి రహస్యవాంఛ. అభివృద్ధి సూచికలలో శిశుమరణాల రేటు తగ్గటం, ఆయుఃప్రమాణం పెరగటం తప్పుగా చేర్చారేమోనని అతని అనుమానం.

ఐనా అతను ఆ శిశుమరణానికి విచారిస్తున్నాడు.

నెలతక్కువగా ఓ బిడ్డపుట్టి, రోజుతిరక్కుండా చచ్చి తన ప్రగతికి అడ్డుపడతాడని పరమ శివుడికి కల రాలేదు. డబ్బులు జుర్రుకునే జ్యోతిష్కులు చెప్పలేదు. రోజుకోరకం కనిపెట్టే శాస్త్రజ్ఞులు ముందేం జరగబోతోందో చెప్పే యంత్రం కనిపెట్టలేదు. కలలూ, జ్యోతిష్కులూ, శాస్త్రజ్ఞులూ కూడబలుక్కుని కుట్ర పన్నినందుకు కూడా అతను విచారిస్తున్నాడు.

అతనికప్పుడు రెండు గుర్తువచ్చాయి. గ్లోబల్ విలేజ్ అన్న తెల్లోడి తెలివి. పల్లెటూరిని ఏలడం వస్తే పెపంచకం ఏలడం అదే వస్తుందిరా– అనే బ్రహ్మానాయుడి చుట్ట పీలుపు.

తన చలచల్లని గదిని, శబ్దాల కార్ఖానాని, కాలుష్యాన్ని విరబూస్తున్న పారిశ్రామికవాడని, జనాన్ని కలిగినోళ్ల లేనోళ్లుగా విడదీస్తున్న భాగ్యనగరాన్ని, అంతా చూడలేక కళ్లు మూసుకున్న బుద్ధుడినీ వదిలి ఆఘమేఘాలపై బ్రహ్మానాయుడి మిద్దెమీద దిగాడు శివుడు.

• • •

నోట్లో చుట్టతో.. నోటిమీద మీసాలతో... బుర్రలో అనంత వేదాంతాలతో.. శరీరంలో దిగుతున్న మందుతో.. పక్కలో సరస్వతిని ఇప్పుడే వాడాలా లేక ఇంకొంచెం తాగి వాడాలా అన్న సందిగ్ధంతో.. తన దాబా మీద.. తన మంచం మీద.. ఆదమరపుగా ఉన్నాడు బ్రహ్మ నాయుడు.

'పాహి పాహి' అంటున్న శివుడి కేకలకి అదిరిపడి, కళ్లు విప్పి, సరస్వతికి దుప్పటి కప్పి 'రావయ్యా రా' అంటూ ఆహ్వానించాడు.

'అసలు నువ్వొస్తే సాలు – సావు వోసన గుప్పుమంటది.' పక పక నవ్వాడు.

'నీకన్నీ యిగటాలే.. పక్కల సరస్వతమ్మ సాలు నీకు.. నీకేటి సీకా సింతా??'

ఓసోసి.. పది మందిని ఎట్టుకుని, వంద పారేసి, ఏలు లాగేస్తావు.. నీకొచ్చిన సావేటో!!'

పరమశివుడు గద్గద స్వరంతో అన్నాడు. 'ఔను బెమ్మం, ఆ సావు నా సావుకే వచ్చింది..'

'ఏ సావూ నీ సావుకి రాగూడదే'

'నువ్వన్నది నిజమే గాని ఇప్పుడది అబద్ధం.. ఓ సావు నా సావుకే వచ్చింది..'

'ఎవరిదా సావు..'

'ఓ నెల తక్కువ బిడ్డది. ఇంకుబేటర్లో కునికేసింది.'

'ఇంకుబేటరా.. అదేటది?'

'చంటిబిడ్డలకి నెలలు నిండకుండా పుడితే అమ్మకడుపులో ఉన్నట్లు తగిన ఉష్ణోగ్రత కల్పించే బాక్స్.' అంది దుప్పటిలోంచి సరస్వతి.

'అదెవరు.. కొత్త సరస్వతమ్మలాగుంది.'

'అవునబ్బా.. బాగా సదుంకుంది. లోకాలన్నీ సూసింది. ఏటేటో మాటాడుద్ది. ఏటీ మాటాడదు మనం అడిగితే...'

'మరొచ్చి నీ పక్కలో ఎందుకు తొంగుంది..'

'మరదే యిసిత్రం. అది సరేగాని దాని కత ఇంటావా. నీ కత సెప్పుతావా..'

'నా కత సెప్పుకుంతాను. ఆరుస్తావో.. తీరుస్తావో సూస్తాను'. అంటూ నిట్టూర్చాడు శివుడు.

'నెలలు నిండకుండా కొంపలు మునిగినట్టు పుట్టి, ఇంకుబేటరులోనే గిట్టి, నా కొంప ముంచిందో శిశువు.' అన్నాడు శివుడు.

'ఛ! ఆటిల్లో శిశువు మరణించకపోతే పశువు మరణిస్తదా శివుడూ' గునగునా నవ్వాడు బ్రహ్మం.

'నువ్వన్నదీ పాయింటేగాని.. ఇది ఆరో శిశువు.'

'ఈ శిశువు మన శిశువా? మన వోళ్ళ శిశువా? మన కులపోళ్ళ శిశువా? ఎందుకు ఇసారం?'

'చ' అన్నాడు శివుడు చటుక్కున.

'అవుతే ఆ సావు నీసావుకెందుకొచ్చిందీ?' అంటూ చుట్ట ముట్టించాడు బ్రహ్మం.

'అదే విధి అనొచ్చు. యుద్ధాలు జరిగిపోతన్నాయి. భవనాలు లేచిపోతన్నాయి. ఓడలు మునిగిపోతన్నాయి. విమానాలు కూలిపోతన్నాయి. మనుషుల్ని పిట్టలు పేల్చినట్టు పేల్చేస్తన్నారు. విమానాలతో బాంబులు పట్టుకెళ్ళి గంపల్తో ఒంపినట్టు ఒంపేస్తున్నారు. సెట్టు దులిపితే కాయలు రాలినట్టు జనాలు రాలిపోతన్నారు. ఇన్ని సావుల్లో ఏ సావూ నా సావుకి రాలేదు' శివుడు విచారంతో కృంగిపోయాడు.

'పక్కవాడి సావుకి ఏమాత్రం ఏడవనోడూ, తన సావు తర్వాత ముక్తి కోసం బతికున్నంత కాలం ఏడిసేవోడూ నికార్సయిన వేదాంతిట.'

'గుడ్ డెఫినిషన్' అంది దుప్పట్లో సరస్వతి.

'నీ ఏదాంతం ఏ కాల్వేట్లో కొట్టుకుపోనాది శివుడూ' అని ఆగి 'కొంపదీసి ఆ ఇంకుబేటరుకీ మనకీ లింకుందా?' అన్నాడు.

'పట్టేసావు బాబాయ్! ఆ ఇంకుబేటర్ని తయారు సేసింది మనమే..'

'ఒక్క శిశువు సావే నీ సావుకొస్తదా శివుడూ'

'నిజమే – రారాదు. వచ్చీనాది. ఎంక్వయిరీలు ఫేషనైపోనాయి రైటే! అవునుగాని బ్రహ్మం – నెల తక్కువ బిడ్డ సావుకీ ఎంక్వయిరీయేనంటే ఏ ఏట్లో పడమంతావు!' ఇందుపగింజలంత కన్నీళ్ళు బొటబొటా కార్చాడు శివుడు.

'అందాకా ఎందుకు రానిచ్చావు శివుడూ?' అన్నాడు అతని కన్నీరు తుడుస్తూ.

'ఎవురి శిశువైనా సస్తే మహా ఏటవుద్ది – అయినోళ్ళు ఏడుస్తారు. అది న్యాయం.'

'నిప్పులాంటి నిజం సెప్పావు'

'అళ్ళ ఏడుపులోకి ఓ జర్నలిస్టుగాడు దూరిపోనాడు. ఇంకుబేటర్లో శిశువు ఎలా కునికేసిందీ – అనేసి ఓ ప్రశ్న ఏసాడు. కర్మ మూడితే అమెరికా పెసిడెంటైనా ఆరిపోతాడన్న సింపుల్ సూత్రం ఆడికీ తట్టనేదు. అక్కడున్న డాక్టరికీ తట్టనేదు. అసలలాంటి వెర్రి ప్రశ్న వేసినందుకే ఆ డాక్టరుకి మండింది. ఆ మంటలో ఆయన ఓ ఎదురు ప్రశ్న వేసాడు. – ఇప్పటికి ఈ ఇంకుబేటర్లో నాకు తెలిసి అయిదుగురు టపా కట్టేసారు. ఒక్కరంటే ఒక్కరు – ఎందుకు చచ్చారని నన్ను అడగలేదు. నువ్వెందుకు అడుగుతున్నావో ముందు చెప్పు జర్నలిస్టూ–– అని కడిగేసాడు..'

'పోతేపోయింది బలేగా అడిగాడు శివుడూ!'

'నానూ అలాగే సంబరపడేవోణ్ణే – ఆ ఇంకుబేటరు మన ఫ్యాక్టరీలో తయారవకపోతే'

'నీ గురించి రాసేది రాయాలన్నా – రాయగూడంది రాయగూడదన్నా – ఇంతవృద్ధి అని కరాకండీగా సెప్తాడు మావూరి విలేఖరి. ఆడేటి మొనగాడా–'

'నువ్వన్న మాటా నిజమే – పేపరోళ్ళూ, టీవీ వోళ్ళూ పాపం పెరిగినట్టు పెరిగిపోయారు. నక్కలు బొక్కలు వెదుకుతాయి. ఈళ్ళు తలుపుకన్నాల్లోకి తలలెట్టేస్తన్నారు. ఎక్కడ ఏటుందా అని సూస్తన్నారు. అది ఆళ్ళ తిండి, ఆళ్ళ జీవనం. సివరాకరికి ఆళ్ళూ పెట్టుబడి కులస్తులే గదా – కూంతంత తేడాలతో ఆళ్ళు సూసిన బొక్కలన్నీ మూసీయెచ్చు. కానీ–' అంటూ ఆగాడు శివుడు.

'సెప్పు సిగ్గుపడక!' అన్నాడు.

'చర్చిల్ గుర్తొచ్చాడు బాబాయ్'

'ఆడెవడు?'

'రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ ప్రధానమంత్రి' అంది సరస్వతి పక్కకి వత్తిగిలుతూ.

'తస్పదియ్య – ఇంకా తొంగోలేదా – కత సదవనీవే సరస్వతీ–' అని చెయ్యిమీదేసి 'నువ్వు సెప్పు శివుడూ' అన్నాడు బ్రహ్మం.

'ఆయన ఏటన్నాడంటే – పేరు కావాల రావాల – అదెలాటిదీ అని లెక్కలెయ్యకూ – అన్నాడు. దాంతో టెంప్ట్ ఐపోనాను. కూన్నాళ్ళు పేపర్లో నలిగితే అప్పనంగా అడ్వర్టైజ్‌మెంట వుద్దని ఆశపడ్డాను. అన్నీ అనుకున్నట్టవవుగదా – హతవిధీ–'

'పోన్లేరా శివుడూ! ఆళ్ళు రాసేయన్నీ సత్యాలేనని రాజ్యాంగంలో లేదుగదా – ఆళ్ళ మాటలు పట్టుకుని న్యాయస్థానాలు తీర్పులివ్వొచ్చని ధర్మాసనాలు తేల్చలేదుగదా'

'అలా జరిగితే మాత్రం – జర్నలిస్టు రేటు పెరుగుద్ది అంతే!'

'అయితే ఏటయింది – నువ్వలా ఏడుస్తున్నావూ?'

'ప్రతిపక్షమనీసి ఓటుంది గదా – ఎన్నికలైపోయాక ఆళ్ళని మళ్ళీ ఎన్నికలొచ్చేదాకా జైళ్ళలో ఎట్టేసినా బాగుండేది – కనీసం పేపరు సదవకూడదనీసి ఓ చట్టం చేసినా బాగుండేది.'

'అదెలా కుదురుద్దిరా శివుడూ – జరుగుతున్నదంతా న్యాయంగా ధర్మంగా ఉందని జనానికి తెలియాలంటే– మన బతుకు బాగోకపోతే దానిక్కారణం మన కర్మేనని జనాలు అర్థం తీసుకోవాలంటే– కుర్చీలో ఉన్నాడిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టే ఏర్పాటు ఉండాలి గదా.'

'దానికీ ఓ లిమిట్ ఉండాలిగదా బాబాయ్! అగ్నిహోత్రుడికి అజీర్ణ వ్యాధి. ప్రతిపక్షాలకి అరవటం వ్యాధి. ఇప్పుడాళ్ల పని మరీ సులువైపోనాది. పొద్దుట లేగటం సాలు. పేపర్లు

రెడీ. ఆటిల్లో వ్యాఖ్యలనూ, ప్రశ్నార్థకాలనూ వదిలేసి వార్తలను సదువుతారు. సెన్సారు వాళ్ళు - 'బూతు లేదు' అనే కళ్ళజోడు పెట్టుకుని సినీమా చూస్తారుగదా! ఈళ్ళు - నీతిలేదు- అనే కళ్ళజోడు ఎట్టుకుని వార్తలు సదువుతారు. అలా సదివి- నీతి లేదు - అంటే ప్రభుత్వం ఉంది అని అర్థం పీకుతారు-'

'అది ఆడికి వచ్చీ ఎన్నికలకి మదుపు. మనమేంజేస్తాం. మన కోడిపెట్టలాడు కేబినెట్లో ఎందుకున్నట్టు- ఓ ఫోనుగొట్టలేకపోయావా?'

'ఫోనేటి- పట్టుకొచ్చి పీకలదాకా పోసాను. అదే కొంప ముంచింది. దక్షిణలు పంజేసినట్టు ఉత్తరాలు పంజేయటంలేదంట. ఒక్కోసారి మంత్రాలు వికటించినట్టు బెడిసికొడుతున్నాయంట. మనకీ కోడిపెట్టలాడికీ ఉన్న సుట్టరికం పట్టేసారు-'

'ప్రతిపక్షాల అరుపులతో పత్రికల బాక్సు సైజు పెరిగింది. పిచ్చోళ్ళకి కరెంటు పెట్టే పరికరాలూ మన తయారీయేనని, అందులో పోయినాళ్ళ లెక్కలూ తీసి దాన్ని ఓ పదిపెట్టి గుణించేసారు. ఇంకేటుంది? అసెంబ్లీలో బల్లలు బద్దలు.. మైకులు విరుగుట..'

'స! ఇంతసిన్న దానికే...'

'రోజు బాగుంటే మనం పదిమందిని లేపేసినపుడే వంద మందిని లేపేసిన వార్త వస్తుంది. బాగోకపోతే మనదే ఇస్యూ అయిపోతుంది. దానికి తోడు మన కోడిపెట్టలాడికి నోటి తుత్తర. ఎంక్వైరీనేదు ఏగుడ్డూ నేదు పొమ్మన్నాడు. ఆళ్లు బిగుసుకుపోనారు. సియం మనోడికి నచ్చజెప్పాడు. ఏసింది ఎంక్వైరీయే గదా - ఉరి కాదు గదా - చేసిన పెతిసారీ బిడ్డా పుట్టదు - ఏసిన పెతి ఎంక్వైరీ గుడ్డూ పెట్టదు- అన్నాడు. మనోడు మెత్తబడ్డాడు. నేనింత కన్నా నీతో మునగలేనురా శివుడూ - అని చేతులెత్తేసాడు'.

'ఆడికేటిలే జలగలా జారిపోతాడు'.

'పైగా పిలాసపీ చెపతాడూ - ప్రభుత్వపక్షంలో కూడా అన్నిట్లో ఉన్నట్టే తరగతులున్నాయంట. సీయమ్మూ ఆయన దగ్గరాళ్లూ ఒకటో తరగతిట. సీయమ్మవకుండా కాళ్లూసేతులూ అడ్డమెట్టినాళ్లు మూడో తరగతిట. ఎటూ గానోళ్లు రెండో తరగతిట. బస్సు నడవకపోతే ముందుగా ఎవరు దిగుతారు- కడమ తరగతి. మనం మొదట దిగాల్సిన ఆఖరి తరగతి. ఇహ నీ ఏడుపు నువ్వు ఏడు శివుడూ అనేసేడు'.

రేగుబళ్ళంత కన్నీళ్ళు కార్చాడు శివుడు.

'అవునూ- నువ్విలా మాటిమాటికీ ఏడిచేస్తావు- ఓ అరడజను మంది శిశువులూ, ఓ డజను మంది పిచ్చోళ్లూ పోయారే అనుకో - ఆటిని నువ్వు తప్పుగా బిగించావని తేల్చారే అనుకో- మాటవరసకి అనుకో- నీకేటి ఉరేసేస్తారా- అలాటిది ఎక్కడన్నా విన్నావా- కన్నావా-' అన్నాడు.

శివుడు మళ్ళీ ఏడిచాడు. ఆ తర్వాత తన కన్నీళ్ళు తనే దిగమింగుకుని అన్నాడు.

'సరస్వతమ్మను లేపు. ఓ గ్లాసుడు పోసి యిమ్మను'.

'దాందాకా ఎందుకు? నేనే పోస్తాను–' సీసా తెరవబోయాడు.

'ఆమాత్రం మూత నేనూ తీయగలను – నేనూ పోసుకోగలను'

'మరింకేం – కానివ్వు'

'ఇప్పటిదాకా నువ్వు ఆయమ్మని తడుముతున్నావు. పరాగ్గా ఉన్నావు. ఇక్కణ్ణించి ఇంటర్నేషనల్ కత మొదలవుద్ది. కాస్తంత బిగ్గా కూకుని యినాలి–'

సిటుక్కున నవ్వాడు బ్రహ్మ.

'కొత్త తీరలేదు శివుడూ' అని తన చేతులు తీసి తన ఒళ్ళో పెట్టుకున్నాక 'సెప్పు' అన్నాడు.

• • •

గ్లాసులో ఉన్నదంతా నోట్లో ఒంపుకుని, దాంతోబాటే దుఃఖాన్ని దింపుకుని పరమశివుడు మొదలెట్టాడు.

'ఏం సెప్పమంటావు – ఎక్కడ మొదలెట్టమంటావు– ఈ జగన్నాటకం ఎప్పుడు ఆరంభమైంది అనమంటావు – యూరప్ నించి తెల్లోడొచ్చి మనమీదకెక్కి మనం నేసుకున్న గుడ్డలని చింపేసి ఆడి మిల్లుగుడ్డలు తెచ్చి మన మీద డంప్ చేసినపుడా – ఆఫ్రికా ఎళ్లి నల్లోళ్ల యిళ్లూ వాకిళ్లూ నేలమట్టం చేసి ఆళ్ళ తలలు కోసి తమ తుపాకీ కత్తులకు గుచ్చి ఫొటోల్లోకి దిగిపోయినపుడా – నాలుగు కోట్ల నల్లాళ్ళని చంపి ఎనభై లక్షల మందిని అమ్మి పెట్టుబడిని పోగు చేసుకున్నపుడా – ఎర్రవాళ్ల తలల మీద చర్మాలకు ఆడ–మగ, చిన్నా–పెద్దా ఖరీదులు కట్టి బజార్లో కొనుక్కున్నప్పుడా – పచ్చవాళ్ళకి నల్లమందుని అందించి వాళ్ళ జీవితాల మీద పెత్తనం సాగించినప్పుడా – పై దేశాలను పాలిస్తూ ఆ సంతలలోకి తమతోటోడు రాకుండా కాపలాకాస్తూ వాళ్లు రాబోతే ప్రపంచ యుద్ధాల్లోకి దిగిపోయినపుడా – యుద్ధాల్లో చట్టలు జారిపోయి వాటిని తిరిగి సద్దుకోటానికి 1947లో గాట్ ఒప్పందం చేసుకున్నపుడా – దిగుమతి సుంకాలతో ఎవరి సంతలు వాళ్ళు కాపాడుకుంటుంటే వాటిని తగ్గించానికి దాదాపు ఏభై ఏళ్ళు కృషి చేసినపుడా – మనబోటి దేశాలు ఎవరి కాళ్లమీద ఆళ్ళు నిలబడాలి గాబోసని పెద్దా, పిన్నా, పీచూ పరిశ్రమలుగా మన పొట్లు మనం పడతంటే – అయ్యవారిని చేయబోయి కోతిని చేశామని – మనచేతే చెంపలు వేసుకునేట్టు చేసేసినపుడా – ఎప్పుడు – ఎప్పుడు – ఎక్కడ – ఎక్కడ – ఎలా – ఎలా మొదలెట్టమంటావు బాబాయ్!' అన్నాడు శివుడు వేదాంతికంగా.

'స! నీకింత జ్ఞానమూ – దేసబక్తీ ఉన్నాయని నేనైతే అనుకోలేదు శివుడూ!' మెచ్చుకున్నాడు బ్రహ్మ.

'గట్టిగా తగిలితే జ్ఞానం పుడుతుంది- అది దేశభక్తిని మతభక్తినీ, కులభక్తినీ, జాతిభక్తినీ పూస్తుంది'. అంది సరస్వతి ముహం మీద దుప్పటిని తీసి పైకి చూస్తూ.

ఓమారు ఆమె వైపు చూసి, చిన్నగా మొట్టి 'గమ్మునుండవే'- అని 'దీని మాటలు పట్టించుకోక శివుడూ' అని చుట్టముట్టించి ఓ పీల్పు పీల్చాడు.

'నీ కష్టం నువ్వు సెప్పుకో - నా సుట్ట నేను కాల్సుకుని, నాకు దొరికిన సరస్వతమ్మను నేను తడుముకుని, నా జనాన్ని, నేను వంచుకుని నా బదుకు నే బతుకుతున్నోణ్ణి. నీ కష్టాన్ని నేనేం ఆర్పగలనని నువ్వనుకుంటున్నావో అదీ నువ్వే సెప్పు' అన్నాడు.

'సెప్తాను- అంతా సెప్తాను-' అని మరో గ్లాసు లోపలికి వంపుకుని గట్టిగా తల విదుల్చుకున్నాడు.

'పెట్టుబడి పుట్టటానికి ఆరోజున మానవరక్తం కావల్సి వచ్చింది. మనోళ్లతో మొదలెట్టి అన్ని జాతుల రక్తాన్నీ పోసాం. అది పుట్టేసింది. దాన్నెట్టుకుని మూడొందలేళ్లకు పైగా తన్నుకు సచ్చాం. అది మన రక్తం కూడా బలికోరింది. ఇచ్చాం, ఇహ చాలు. అది పెరగటానికి ఈ రోజున మనిషి చెమట చాలు. అదే చవక. అని యుద్ధంలో దెబ్బతిన్న దేశాలు తేల్చు కున్నాయి. ముందుగా మన దెబ్బలు మనం మాన్పుకోవాలి. అని అప్పట్లో పునర్నిర్మాణ బాంకు పేరుతో ప్రపంచ బాంకుని 1945లో పెట్టుకున్నాయి. మళ్ళీ దెబ్బదిని ఆర్థిక సంక్షోభాలూ రాకుండా సూసుకోవాల - అని 1946లో అంతర్జాతీయ ద్రవ్య నిధిని ఏర్పాటు సేసుకున్నాయి. తమ మధ్య వ్యాపార ఒప్పందాలు చేసుకోటానికి, తగువులొస్తే తన్నుకు సావకుండా పరిష్కరించుకోటానికీ 1947లో గాట్‌ని ఏర్పర్చుకున్నాయి. దెబ్బతిన్న యూరప్ దేశాలు దెబ్బతినని అమెరికాకి పెత్తనం అప్పజెప్పాయి. దాలరే ప్రపంచానికి రూపాయను చేసుకున్నాయి. అమెరికా మీద ఎంత మంట ఉన్నా తమలో ఉన్న కమ్యూనిస్టు పుందుకి అదే శస్త్రచికిత్స చెయ్యగలదని లెక్కలేసుకున్నాయి. సివరాకరికి ఆ పుందుని కోసేసి, అది మిగిల్చిన కాన్సర్ కణాలను కాల్చెయ్యటానికి థెరపీలు అమెరికా యూనివర్సిటీలు సిద్ధం చేసిపెట్టాక ఇహ మనం విజృంభించొచ్చునని చొక్కాలు మార్చుకున్నాయి. పునర్నిర్మాణ బాంబు పెపంచ బాంకు అయింది. అభివృద్ధికి అర్థం అర్థమే అంది. పెలిదానికీ కొలబద్దలు నిర్మించింది. గాట్ WTO అయింది. 90ల తర్వాత జగన్నాటకం బహిరంగమయింది'. అంటూ ఆగాడు.

'నువ్వీ సోదంతా ఎందుకు సెపతన్నావు శివుడూ'

'కోహం-' అని మళ్ళీ కన్నీళ్ళు కార్చాడు.

'నేనేటి - అని ప్రశ్నేసుకునీది ఒక్కడే. ఆడికి తనేటో తెలిసినా మానినా - ఈ పెపంచ కంలో నాకేటి అని ఆలోసించేవాడికి ఆడు బోలెడంత మేటరు వదిలీసి పోతాడు. నా

ఇంకుబేటర్లో కునికేసిన బిడ్డకీ, ఈ పెపంచ నాటకానికీ సంబంధం ఇడమరసాలన్నదే నా బాధ' అన్నాడు.

'సరిసరి – కార్సీ కన్నీళ్ళు గబాగబా కార్చి ముందుకెళ్ళు.'

'సరిగ్గా ఆ టయానికి – తెల్లోడు ఎల్లిపోనాదని మాంచి ఊపు మీద ఉన్నారు మన పెద్దలు. సొతంత్రం తెచ్చీసామని, ఇహేముంది – జనం కూడుకి ఇన్ని కోట్లు, గుడ్డకి ఇన్ని కోట్లు, నీడకి ఇన్ని కోట్లు అని టాటా బిర్లాలు లెక్కలేసి అంత డబ్బు కావాలంటే తలసరి ఆదాయం పెరగాలన్నారు. అదే దేశం అభివృద్ధీ అన్నారు. జనం బాగూ అదేనని చెపితే పెద్దలకి పెద్ద నెహ్రూ గారు నమ్ముతున్నారు. ఆయన నమ్మటం కన్న జనాన్ని నమ్మించటం చూసి ఇండియాలో మనకి పనికొచ్చే పెద్దమడిసి ఈయనేనని పెపంచ బాంకు ఉద్యోగులు రిపోర్టులు రాసారు.

ఆసియాలో చైనా చెయ్యి జారిపోయింది. ఇండియా జారటానికి వీల్లేదు. అందుకని మనం రైతుల సంగతి పట్టించుకోవాలి. ఆ పని పెద్దాయన చక్కగా చేస్తున్నాడు. ఆళ్ళ అసలు బాధ షావుకార్ల అప్పులు, ప్రకృతి వైపరీత్యాలూ, సహకార సంఘాలతో అప్పులు చల్లార్చి, ఆనకట్టలు కట్టి నీళ్ళను అదుపుచేసి కమ్యూనిజం మీద నీళ్లు జల్లుతున్నాడు. అని రిపోర్టు చేసారు.

మరవుతే దేశానికి పెట్టుబడి ఎలా? ఓ గుడారంలో అమెరికా ఉంది. ఓ గుడారంలో రష్యా ఉంది. సొంత పెట్టుబడే పెట్టుబడి అన్నదొకరి మంత్రం. ప్రభుత్వమే పెట్టుబడిదారుడు అన్నదొకరి మంత్రం. ఏదో మంత్రం చదివి ఎవరో ఒకరి వద్ద దీక్ష తీసుకోవాలి. పెద్దాయన అటూ ఇటూ చూస్తున్నాడు. అప్పటికి రష్యా భక్తులు దేశంలో చిందులు తొక్కుతున్నారు. పార్లమెంటు ద్వారా వచ్చేస్తాం. మార్క్సిజాన్ని తిరగ రాసేస్తాం. రాజ్యాంగాన్ని మార్చేస్తాం. ఆస్తులన్నీ జాతీయం చేసేస్తాం. భూస్వాముల పెళ్ళాల మెడల మీద కాడిపెట్టి దున్నిస్తాం – అంటూ పెడబొబ్బలు పెడుతున్నారు. అందరి మాటలూ విన్నాక పెద్దాయన రష్యాకి జై అన్నాడు. వాళ్ళ పంచవర్ష ప్రణాళికలు మనకి మోడల్ అన్నాడు. జనం పేరిట అప్పు చేసి పెద్ద పరిశ్రమలు మేం పెడతాం అన్నాడు. వందమందికి అన్నం పెట్టే జనాలకు తక్షణ లాభాలిచ్చే పరిశ్రమలన్నాడు. లక్షలాది ఎకరాలు ఇచ్చాడు. రాయితీలు ఇచ్చాడు. చిన్న మదుపుదార్లకి చిన్ని పరిశ్రమలిచ్చాడు. పోటీపడి మట్టికొట్టుకు పోకుండా రక్షణ ఇచ్చాడు. ఇలా ప్రభుత్వ రంగాన్ని కమ్యూనిజానికీ, ప్రైవేటు రంగాన్ని అమెరికనిజానికీ నమూనాలుగా చూపించి మనది చౌచౌ ఎకానమీ అన్నాడు. కమ్యూనిస్టులని ప్రధాన స్రవంతిలో కలిపేసాడు.

తన పని పూర్తి చేసుకుని ఆయన తనువు చాలించాడు. పెపంచ బాంకు అంతా చూస్తూనే ఉంది. దాని ముసుగులోంచి అమెరికావోడు లెక్కలేసుకుంటూనే ఉన్నాడు. మెతుకే ఆయుధ

మంటన్నాడు. గింజే శాంతి అంటున్నాడు. హెచ్చు దిగుబడి విత్తనాలు కనిపెట్టినాయనకి నోబుల్ శాంతి ప్రైజు అన్నాడు. ఇక్కడ నిప్పు కారుచిచ్చు కాకుండా మన బళ్ళలో, ఇళ్ళలో గోధుమల్లో పాలపిండిలో మతాన్నీ, ధనాన్నీ కలిపి జల్లాడు. అక్కడ రష్యా గుడారానికి మార్కెట్లో నిలబడ్డం తప్ప మార్గం లేకుండా చేసి మార్గం తప్పించాడు. మార్కెట్లో ఆళ్ళు నిలబడలేకుండా జేసేసి నెమ్మది నెమ్మదిగా వుండును కోసేసాడు.

మన ప్రభుత్వాలకున్న ఇంతో అంతో డైలమా 90ల నాటికి పోగొట్టేసాడు. అందాకా ఉన్న – ఏ దేశానికి ఆ దేశం నిలబడాల – అన్న మంత్రం తన పని ముగించుకుని వెళ్ళి పోయింది. పెపంచమంతా కల్సి లెగాల అన్నది కొత్త మంత్రం జేసారు జగన్నాటక సూత్ర ధారు. నిజానికిది కొత్తదేంగాదు. లోగడ కమ్యూనిస్టులు అనుకున్నదే – నీకాడ ఉన్నది నువ్వియ్యి. నాకాడున్నది నేనిస్తాను. మనలోమనం కట్టుగా ఉందాం– అన్నదే. దానికి అటూ ఇటూ సిన్నసిన్నయి తగిలించి తెగ్గొట్టి అల్లినదే ఈ మంత్రం.

దాని పెకారం–

వ్యక్తికి ఆడి బాగు ఆడికి తెలుసు. ఆడికి కావలసిందేటైతే ఉందో దాన్ని సరఫరా చెయ్యటం మార్కెట్‌కి తెలుసు. దాన్ని నీ దేశస్తులే చెయ్యాల అమ్మాల అనుకోరాదని నువ్వు తెలుసుకో – సాలు, కావాలనుకుంటే నువ్వూ చెయ్యి. నీ పెట్టుబడిదారులనీ చెయ్యనియ్యి. చేసి నీ దేశంలో ఏం కర్మ – పెపంచమంతా అమ్ముకోండి. అయితే అది జనానికి చవగ్గా దొరకదు. పక్కపక్కన పది కొట్లు ఉన్నప్పుడే జనానికి సవగ్గా దొరుకుతుంది. సరే– నీకాడ జనానికి సరిపడా సరుకు లేదనుకో– నువ్వేంజేస్తన్నావు– ఆడినించో ఈడినించో దిగుమతి సేసేసుకుంటన్నావు – మనోడని ఈడికో సుంకం – దూరపోడని ఆడికోసుంకం ఏస్తన్నావు. దానివల్ల ఏటవుతోంది? నువ్వు సవకలో సేసి అమ్ముకోటానికి పట్టుకెళితే ఆడు నీకు ఇంకో అంత సుంకం వడ్డిస్తాడు. నీ కిట్టుబాటు రేటు పక్కోడి రేటుకి రెట్టింపయిపోద్ది. అదే– నువ్వు తెలివిగా ఆడిలాగే ఆడికీ అందరికీ మోస్ట్ ఫేవరేడ్ నేషన్ స్టేటస్ ఇచ్చావనుకో. ఇంకేటుంది! నువ్వూ అందరికీ మోస్ట్ ఫేవరేడ్ ఐపోతావు. నువ్వు ఎక్కువగా చవగ్గా సెయ్యగలది నువ్వు అమ్ముకుంతావు. నీకు కావలసింది ఆడు తెచ్చి అమ్ముకుంతాడు. ఇది పరస్పరం ఆధారపడ్డ పెపంచం.

అని వివరించారు జగన్నాటక సూత్రధారులు. సార్వభౌమదేశ ప్రభుత్వాల మధ్య చర్చలు నడిపి, ఒప్పందాలు చేయించి, ఆటిని రూల్సుగా రాసిపెట్టి దాని పెకారం పెపంచ వ్యాపారం జరిగేట్టు చూస్తుంది WTO అన్నారు.

ఐతే–

ఇంతకాలం ముద్దుబిడ్డల్లా సూసుకున్న మా పెట్టుబడిదారులని మీ ఏడుపు మీరేడండి –

అన్నారు మన పెద్దలు. ఉన్న మార్కెట్‌ని ప్రభుత్వం కాపలా కాసి పెడతంటే - ప్రభుత్వోద్యోగులు నడుపుతున్న ఫ్యాక్టరీలను కొనేసేంతగా బలిసిన మావోళ్ళు ఎందుకు కిమ్మనలేదు - ఉన్న మార్కెట్ కూడా ఊడిపోయి వాళ్ళ కార్ఖానాల పొగగొట్టాలలో పడి ఆత్మ హత్యలు చేసుకోవాలేమోనని ఎందుకు భయపడలేదు?

మావోళ్ళు భయపడుంటే ఈసావు నా సావుకొచ్చేది కాదు. ఒకేల ఒచ్చినా ఇంత కుదేలైపోయే వాడిని కాదు-' అని కాశీరేగు పళ్ళంత కన్నీళ్ళు కార్చాడు పరమశివుడు.

• • •

ఈసారి తనే మరోగ్లాసు నింపి అతని గొంతులో ఒంపాడు బ్రహ్మానాయుడు. దాంతో కాశీరేగు పళ్ళనీ మింగి గొంతు సద్దుకున్నాడు శివుడు.

'ఈస్టిండియా కంపెనీ వాళ్ళు శిస్తుల వసూళ్ల కోసం కోదండాలు వేయించి, వాళ్ళ అడంగుల స్తనాలకు కిట్టీలు వేసి చిత్రహింసలు పెడుతూంటే ఏ రైతూ తిరగబడ లేదు. ఆ హింసలు పెట్టటానికి జీతాలిచ్చి పెట్టుకున్న సైనికులు తిరగబడ్డారు - అంటాడో పెద్దాయన. రక్షణలో ఉండి రాజ్యమేలుతున్న మావోళ్ళు - ఆ రక్షణ పోతూ ఉంటే - రైతుల్లా ఆత్మహత్యలు చేసుకోలేదు-' అంటున్న శివుడికి అడ్డుబడిపోయాడు బ్రహ్మ.

'గిట్టుబాటు ధరలు లేవు. అమ్మబోతే అడివి కొనబోతే కొరివి అయ్యాయి పంటలు. ఉన్న సబ్సిడీలు తీసేసారు. భూమ్మీద ఎట్టిందీ సముద్రంలో పోసిందీ ఒకటే అయింది. సావకేంజేస్తారు రైతులు-' అన్నాడు.

'మరపుతే నువ్వెందుకు పురుగుల మందు తినలేదో - బెమ్మం!'

బ్రహ్మం జవాబిచ్చేలోగానే శివుడు కొనసాగించాడు.

'నీకాడ ఆ దెబ్బ కాసుకునీ దబ్బుందన్న మాట. ఆ సత్తా లేనోళ్ళు దుల్లిపోతారు. ఇలా హాఫీనడఫీనీగాళ్ళు రాలిపోగా నీబోటోళ్ళు ఆ బూముల్ని పోగేసుకుంటారు. స! నువ్వలా పోగు సేసుకోకూడదు. చట్టం ఒప్పుకోదు - అంటుంది ప్రభుత్వం. అప్పుడు నాబోటోళ్ళు నీతో కూడతారు. - నువ్వో కంపెనీ ఎట్టు. అందులో షేర్‌హోల్డర్స్‌ని చేర్చుకో. కంపెనీ పేర బూముల్ని కొను. ఎవసాయాన్ని పరిశ్రమలా సెయ్యి. అందుకు చట్టాలు లేకపోతే చెయ్యించు- అని సలహాలు ఇస్తాం. అన్నదాత వెన్నెముక సెంటిమెంట్లొగ్గీ అంటాం. ఇయ్యన్నీ నేననీయి కాదు. పెపంచ ఏపార సంస్థ నేరుగా సెప్పకపోయినా నేర్పుగా సేప్పేది ఇదే. అది ఏపారంలో ఆటుపోట్లని నియంత్రించాలంటుంది. ప్రిడిక్టబిలిటీని పెంచాలంటుంది. మానవుడి ప్రతి కార్యకలాపమూ మదుపూ - మార్కెట్ - లాభంగానే సూడాల - నడపాల - నడవాల - అంటుంది.'

'దానం, దయ, కరుణా, ప్రేమా, లాలిత్యం, సౌందర్యం, సంసారం, బిడ్డలూతో సహా'

అంది సరస్వతి బొంగురుపోయిన గొంతుతో.

ఇద్దరూ ఆమె ఇంకా ఏమైనా అంటుందేమోనని చూసారు.

చూసి చూసి 'నువ్వు కానీ' అన్నాడు బ్రహ్మం.

'ఇది మావోళ్ళ సెవికి ఎక్కింది.

మావోడా- మనలోవోడా - తలకెక్కించుకో - మల్టీనేషనల్ అనీ ట్రాన్స్‌నేషనల్ అనీ అంటున్నపుడు నిజానికి ఈ కంపెనీ పలానీ దేశంది అని సెప్పటానికి వీలవుద్దా? ఏ కంపినీ లాబమైనా అది పుట్టిన దేశానికే పోతుందా? అది పుట్టిన దేశానికే పన్నులు కడుతుంధా? అది పుట్టిన దేశం బాంకులనించే ఆ దేశం జనాల సొమ్మే అప్పు తెచ్చుకుంటుందా? మెట్టిన దేశాలకు లాబాలు పంచటం లేదా - పన్నులు కట్టటం లేదా- ఆ జనాల సొమ్ము వాడుకోటం లేదా-? అంటేటి- సరిహద్దులు నీ మెదడులో ఉన్నాయి. రాజకీయ పటాల మీద ఉన్నాయి. కంపినీలకు లేవు. పెట్టుబడిదారులకు లేవు. మగతనం ఉన్నోడికి ఏ ఆడదైనా ఒకటే అన్నట్టు- నీకు ఓపిక ఉండాలగాని నువ్వు ఏ దేశం మీదకైనా ఎక్కొచ్చు. నువ్వు నీ దేశపోళ్ళనే గాదు ఏ దేశపోళ్ళనైనా వాడుకోవచ్చు. నీకు నీ ప్రభుత్వమే కాదు - అన్నిదేశాల ప్రభుత్వాలూ వాళ్ళ రక్షకభటులనీ, సైనికులనీ కాపలా పెడతాయి. నీ బాంకులే కాదు- అన్ని బాంకులూ అప్పు ఇస్తాయి. ఐనా నువ్వు దెబ్బ తినీసావనుకో - దీనికాకారణం నీకు తెలివితేటలు లేకపోటం. అవి లేకపోతే నీ దేశపోళ్ళు నీకు జల్లకొడతారు. నువ్వు నీ పోటీదారుడు కన్న ప్రిడిక్షన్‌లో ఎనకబడి పోయావన్నమాట. టేకోవర్లూ, మెర్జర్లూ ఆట సరిగ్గా ఆడలేకపోయావన్న మాట. నీ బతుక్కీ దేశానికీ సంబంధం లేదు. దేశవాళీ పెట్టుబడి కులమని ఏరేగా లేదు. ఆ మైండ్‌సెట్ నించి పదండి ముందుకు. పెపంచ పెట్టుబడి కులంలో పదండి తోసుకు. ప్రపంచ దోపిడీలో భువన భవనపు బావుటాలై లే!

అని జగన్నాటక సూత్రధారులు అన్నది విని మాలో పెద్దాళ్ళు పంచెలొదిలీసి సూట్లు కట్టీసారు.

ఇహ నాబోటి హాఫినీ డఫినీగాళ్లు, మేం ఇప్పటిదాకా అవీ యివీ తయారుజేసాం పొట్టపోసుకున్నాం. అది దెబ్బతినీసిందనుకో - ఏం జేస్తాం! మా ఫాక్టరీ షెడ్లను గోడౌన్లు జేసేస్తాం. తెల్లోడైతేనేటి - పచ్చోడైతేనేటి ఎవడి సరుకైనా తెస్తాం- మా గోడౌన్లలో ఏసి బిగ్గ బజార్లు ఎట్టి అమ్ముకుంటాం. పొట్ట పోసుకుంటాం. లేకపోతే ఆళ్ళ పరిసరాలు దెబ్బ తినీసి పరిశ్రమలు మన దేశంలో ఎడతామంటే మా స్థలం తీసుకో - మా ప్యాక్టరీ తీసుకో - అని క్యూ కడతాం. టెక్నాలజీ ఆడు మదుపు ఎడితే సవక లేబరు మేం మదుపెడతాం. ఇలా ఆడెంత తిన్నా మేం బొక్కేది మేమూ బొక్కచ్చనుకున్నాం. ఇలా పెద్దా చిన్నా బుల్లి అందరం వచ్చే మార్పులు ఎదగటానికి కొత్త అవకాశాలనుకున్నాం గాని బెంగలెట్టుకోలేదు.

కృంగిపోలేదు. –' అంటూ ఆగాడు శివుడు.

'మరి నువ్వెందుకలా ఏడిసినట్టు ఏడకుండా ఏడస్తన్నావూ?' అడిగాడు బ్రహ్మం.

'అక్కడికే వస్తన్నాను బాబాయ్!' అంటూ ముక్కు చీదుకున్నాడు శివుడు.

'నువ్వూ నేనూ సమానమేనని లోకంలో ఏ పెద్దమడిసైనా ఢంకామీద దెబ్బకొట్టి అంటే మనం ఆడిని కాంతంత నిదానంగా సూడాల. అంత సప్పుడొచ్చీ ఢంకా కింద సడీసప్పుడవ కుండా ఏం బిగించాడా అని పరకాయించాల. అప్పుడు జగన్నాటకంలో అంతర్నాటకం కాంతంత కంట పడుద్ది.

నువ్వయినా నేనయినా ఏదైనా సెయ్యిచ్చు. ఎక్కడన్నా అమ్ముకోవచ్చు. అంటాడు సూత్రధారి. నువ్వు ఎంటనే బ్రాందీలో నీళ్ళు కలిపేసి బాగా గిలకొట్టి దాన్ని మాంచి కొత్తరకం సీసాలో ఏసి కిర్లంపూడి ఇన్‌స్టాంట్ బ్రాందీ అని పేరెట్టి ఆళ్ళూరికి పట్టుకెళ్లి ఆడికన్న సవగ్గా అమ్మీటానికి తయారైపోవచ్చు.

అప్పుడాడు ఓసిన్న నవ్వు నవ్వి – కాంతంత ఆదావుడి ఆపుమీ – అంటాడు. ఇది సదుంకో– అని ఓ పుస్తకం సేతిలో ఎడతాడు. అది పెపంచ ఏపార సంస్థలో ఉన్న అంతర్జా తీయ ప్రమాణాల సంస్థ ప్రచురణ.

ఆ పుస్తకంలో నువ్వు తయారు చేద్దామనుకుంటున్న సరుకు ఏ నాణ్యతా ప్రమాణాలకు నిలబడాలో యివరంగా ఉంటుంది. ఓస్ ఇంతేగదా – అని సదువుతావు. ఆడు ఏ తయారీ విధానాల ద్వారా ఆ ప్రమాణాలు సాధించాడో పుస్తకం మొత్తం చింపి చదివినా నీకు దొరకదు: సర్లే గదా అని చెప్పి – ఆ ప్రమాణాలకు ఆడు తయారు చేసానని చెప్పి మనకి అమ్ముతున్న వస్తువు పట్టుకొచ్చి దాన్ని యిప్పి రివర్స్ ఇంజనీరింగ్ సేసి ఆడి తయారీ విధానాన్ని పట్టేసి నేనూ అలాగే మక్కికి మక్కీ దింపేస్తానని తయారైపోయావనుకో – అప్పుడూ ఆడు నవ్వుతాడు. ఇంద ఈ పుస్తకం సదుంకో అని మరోటి సేతిలో ఎడతాడు. అది ఇంటలెక్చ్యువల్ ప్రాపర్టీ రైట్స్ మీద మన ప్రభుత్వం సంతకాలు ఎట్టిన ఒప్పందం. దాని పెకారం నువ్వు కాపీకొట్టి తయారుసేసి అమ్ముకోటం నీ మార్కెట్‌తో సహా ఏ మార్కెట్ లోనూ చెల్లదన్నమాట. లేదూ – ఆడి టెక్నాలజీ పెకారమే నేనూ సేసుకుంటానంటావనుకో – ఆడు కాదనడు. అంటానికి ఆడికైనా హక్కులేదు. ఆడు దాని ధర ఇంతా అంటాడు. నువ్వు సరేనంటావు. ఆడు కొన్ని నిబంధనలు ఎడతాడు. నువ్వు ఒప్పుకోవాలి. ఆడి స్ట్రాటజిక్ ఇంట్రస్టులకి దెబ్బ అనిజెప్పి నువ్వు మిలట్రీ ప్రమాణాలతో సేసిన వాన్‌లు సూడాన్‌లో అమ్మ గూడదన్నాడనుకో – నువ్వు అమ్మగూడదు. అమ్మేవనుకో – నీ దేశం నీ బొక్కలిరగదన్నాల.

స! ఇదేం లాబం లేదనుకుంటావు. నీ ప్రమాణాల ప్రకారమే నేనూ సేసాను. నా టెక్నాలజీ నేనే చేసుకున్నాను– అంటావు.

అప్పుడాడు మళ్ళీ కిసుక్కున నవ్వుతాడు.

నువ్వు ఈ ప్రమాణాలతో సేసావనటానికి సర్టిఫికెట్లు ఏవీ – అని అడుగుతాడు.

నువ్వు బుర్ర గోక్కుని నీ దేశంలో ప్రభుత్వం కింద ఉన్న ఏదో సంస్థ కాడికెళ్ళి ఆళ్ళను బతిమాలోబామాలో ఓ సర్టిఫికెట్టు సంపాదిస్తావు.

దాన్ని ఎగాదిగా సూసి మళ్ళీ కిసుక్కున నవ్వుతాడు.

నువ్వీ వస్తువు తయారు సెయ్యటానికి నీకాడ అన్ని సదుపాయాలూ ఉన్నాయనీ, నీకు ఆ సత్తా ఉందనీ సర్టిఫికెట్టు ఏదీ – అంటాడు. పరీక్షలు సేసి నీ వస్తువు అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపడా ఉందని చెప్పటానికి నీ ప్రభుత్వ సంస్థకు ఆ సత్తా ఉందని సెప్పటానికి సర్టిఫికెట్టు ఏదీ – అంటాడు.

నువ్వు వదలవు. నీది పట్టు వదలని విక్రమార్కుడి దేశం. ప్రయత్నం చేస్తావు.

నువ్వు ఆ సదుపాయాలన్నీ తెచ్చుకుంటావు. ఆ సర్టిఫికెట్లు ఇవ్వదగ్గ సంస్థను కనుక్కుని నీ సదుపాయాలన్నీ సూపించి ఆ సర్టిఫికెట్టు సంపాదించుకుంటావు. అన్నీ సరిపోయాయి.

నీ సరుకుని ఓడలో ఏసి ఆడి మార్కెట్‌కి తోలతావు.

అప్పుడాడు మళ్ళీ కిసుక్కున నవ్వుతాడు.

– నీదే దేశం – అనీసి అడుగుతాడు.

ధీమాగా సెపతావు.

నువ్వట్టుకొచ్చిన వస్తువు ఏటీ – అని అడుగుతాడు.

నేను గుడ్డలట్టుకొచ్చానండీ అంటావు.

దీనికి ఫ్లేమబులిటీ ప్రమాణాలు పాటించావా అడుగుతాడు.

అదేటి బాబు – ఈ పుస్తకంలో లేదు గదా – అంటావు.

నిజమే – లేదు. అవుతే ఈ మద్దిన మావోళ్ళు గుడ్డలు కాల్చుకుని సచ్చిపోతన్నారు. అందుకని మా శాస్త్రజ్ఞులు పరీక్షలు చేసారు. గుడ్డకి నిప్పంటుకుంటే – ఆ నిప్పు కొలత ఇంతయితే– అది ఇంతమేర కాలొచ్చు – అని తేల్చారు. దాని పెకారం నీ గుడ్డ కాలుద్దో లేదో సూడాల – అంటాడు. ఆ గుడ్డా కాలుద్ది. దాంతోపాటు నీకూ కాలుద్ది.

నేను తివాసీలు పట్టుకొచ్చానండీ – టపాకాయలు పట్టుకొచ్చానండీ – అంటావింకో మారు. అన్ని సర్టిపికెట్లూ ఉన్నాయండి అనీసి నీ కట్ట విప్పుతావు.

ఆడు దానికేసయినా సూడ్డు. మరో పుస్తకం తీస్తాడు.

నువ్వు ఆయ్యి తయారు సెయ్యటానికి సిన్నపిల్లల్ని వాడావూ అంటాడు.

అదేటి బాబు – మాది పేదదేశం – పుట్టిన బిడ్డ కాణ్ణించి సచ్చీ ముసిలోడిదాకా పంజేస్తే

గాని పొట్టగడవదు. పైగా పంజేస్తూ నేర్చుకోటమే మా సంస్కృతి – అంటావు నచ్చజెబుతూ.

నువ్వు పెపంచ మార్కెట్లో అమ్ముకోవాలంటే కార్మిక ప్రమాణాలు పాటించాల్సిందే – అంటాడు.

నీకు మందుద్ధి.

సరే – నేను తయారుసేసిన ఈ తివాసీల్లో కనీసం ఒక్కటంటే ఒక సెమటసుక్క ఏ బాలుడిదీ లేదు – అలాగని మా దేవుడి మీద పెమాణం సెయ్యమంటే సేస్తాను. – అంటావు.

దేవుడిమీద పెమాణం ఓ ప్రమాణమేనని మనం కలిసి రాసుకున్న ఈ పుస్తకంలో లేదు. కావాలంటే సూడూ – అంటాడు. మాకు అందిన మా రిపోర్టులే మాకు ఆధారం. అంటాడు.

నువ్వు మంట మళ్ళించుకుంటావు.

అదేటి బాబు – అలాగంటావూ – మీవోళ్ళు రిపోర్టులు రాసేటపుడు ఏదో సన్నాసి కంపినీని సూసేరనుకో – ఆ రిపోర్టు నా కంపినీ మీద కాదుగదా – నాకన్నాయం జరగొచ్చా – నువ్వు దాన్ని ఒప్పేసుకోవచ్చా – నాయమేనా – అని అడుగుతావు.

అప్పుడాడు మళ్ళీ కిసుక్కున నవ్వుతాడు.

నీ దేశం పేరు ఎత్తుతాడు.

ఈ రిపోర్టు నీదేశం మీద. నీ దేశంలో తయారైన పెతీ తివాసీ పిల్లల సెమటలో నానిపోయిందని ఈ రిపోర్టు అంటోంది. ఈ రిపోర్టు చేసిన పద్ధతి మనం ముందే ఒప్పందం చేసుకున్నదే – చూడూ – అంటాడు.

ఓవేళ నువ్వు ఏదో ఆధారం తెస్తావు. నీ హాజరపట్టీ, నీ జీతాల పట్టీ చూసి తనిఖీచేసి – ఈ కంపెనీ తయారు సేసిన తివాసీల్లో సిన్నపిల్లల సెమట ఉందనేందుకు మాకు ఏ ఆధారాలూ దొరకలేదు – అని నీ కార్మిక మంత్రిత్వ శాఖ ఏదో ఓ సర్టిపికెట్టు ఇస్తుంది. అది నువ్వు చూపిస్తావు.

అప్పుడాడు మళ్ళీ కిసుక్కున నవ్వుతాడు.

మన ఒప్పందాలలో ఈ సర్టిపికెట్టుని పరిగణించవచ్చని ఏ క్లాజులోనూ లేదు – అంటాడు.

నువ్వు బిక్కముహం పెడతావు.

ఓ పని చెయ్యి. అలాంటి క్లాజు చేర్పించమని నీ ప్రభుత్వానికి అర్జీ పెట్టుకో. దాని వెన కాల లాబీ చెయ్యి. నీ జాతీయ ప్రభుత్వం సరేనంటే చాలదు. అది ఇతర సభ్యుల మద్దతు కూడగట్టుకోవాలి. దానికి లాబీ చెయ్యాల. అంతవరకూ నీ దేశం తివాసీల్లో సిన్నపిల్లల సెమట వుందన్న మారిపోర్టే సెల్లుద్ది. అందాకా నీ తివాసీల మూటట్టుకుని ఇంటికి ఎల్లిపో ఈ రిపోర్టు చెల్లదనీసి కోర్టుకెక్కుదామనుకున్నావనుకో, నీ మూట దించీసి రా. ఈ పక్క

వీధిలోనే మా కోర్టు ఉంది–' అంటాడు నవ్వు చెదరకుండా.

ఇన్నిరకాల అంతర్జాతీయకాలలోంచి, ప్రమాణాలలోంచి నువ్వు అగ్గి నుంచి బయటపడ్డ సీతమ్మోరిలా బయటపడ్డావు. నీ ఇంకుబేటర్లకి ఓ విదేశీ ఆర్డరు దొరుకుద్ది. నువ్వీ ఊపులో ఉన్నవన్నీ బాంకులో ఎట్టి, ఈ ఆర్డరు సూపించి అప్పుదెస్తావు. ఇంకుబేటర్లు తయారు సేస్తావు. అవి అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపోయాయని అలా సర్టిపికెట్టు ఇవ్వటానికి సర్టిపికెట్టు ఉన్న సంస్థచేత పరీక్షలు సేయించుకుంటావు. అన్నీ రెడీ.

బ్రహ్మం! అలాటపుడు నీకు ఓ లెటరు అందుద్ది.

ఇటీజ్ అండర్‌స్టుడ్ అంటూ మొదలవుద్ది. నువ్వు ఎప్పుడో తయారుజేసిన ఇంకుబేటర్లో ఓ బిడ్డ చనిపోయింది. అందుకు కారణం నీ సాంకేతిక పరిజ్ఞాన లోపమా – దాన్ని వాడిన సిబ్బంది శిక్షణా లోపమా – మానవ లోపమా – తేల్చమని గౌరవనీయమైన నీ రాష్ట్ర ప్రభుత్వం నిపుణులతో కూడిన కమిటీ వేసింది. నీ తప్పు ఏమాత్రం లేదని ఆ కమిటీ రిపోర్టు చేస్తే ఆ రిపోర్టు కాపీని, దాన్ని గౌరవనీయమైన నీ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించితే ఆ అంగీకార పత్రం యొక్క కాపీని మాకు పంపవలసిందిగా కోరుతున్నాం. నువ్వు నీ ఇంకుబేటర్లు పంపే ముందు మాకు ఈ పత్రాలు పంపవలసి ఉంటుంది. నీవు ఈ కారణంగా మనం ఒప్పందం చేసుకున్న తేదీకి సరఫరా చేయలేకపోయినట్లయితే నీకూ మాకూ రాంరాం. నీవు కట్టిన డిపాజిట్టు నీకు చెల్లింపబడకపోగా ఈ వ్యవహారం వల్ల మా ఆస్పత్రులలో జరిగే కష్టనష్టాలకు నీవే బాధ్యత వహించవలసి ఉంటుంది. ఆ విషయంలో నీకు ఆక్షేపణ ఉన్నట్లైతే దాని పరిష్కారానికి మా టెండరు నిబంధనల ప్రకారం మా జ్యూరిస్‌డిక్షన్‌లో కోర్టులను ఆశ్రయించవచ్చు. అప్పుడు నువ్వేటైపోతావు బ్రహ్మం బాబాయ్! – అంటూ బోరుమన్నాడు శివుడు.

• • •

'నువ్వు పెద్ద సిక్కులోనే పడ్డావు శివుడూ!' అన్నాడు బ్రహ్మ కాస్తంత ఆగి.

శివుడు మాటాడలేదు.

'అద్సరేగాని – నాక్కొన్ని డౌట్లొచ్చాయి'

'ఇంకెందుకు – అడిగెయ్' అన్నాడు.

'నువ్వు సూస్తే సదుంకున్నోడివి. ఇన్ని యిసయాలు తెలిసినోడివి. ఈ సిక్కుని తప్పించే మారగం నీకే కాపడలేదంటే నాబోటికి కాపడుద్దా–' అన్నాడు.

'కాపడుద్ది – ఆ నమ్మకం ఎట్టుకునే వొచ్చాన్నేను.–'

'అంత నమ్మకం ఎట్టుకున్నావంటే దానెనక ఏదో ఆలోసన ఉంటాది. అదేటో చెప్పు' అన్నాడు.

'సూదు బ్రహ్మం - తెల్లోడు గ్లోబల్ విలేజ్ అన్నాడు గాని గ్లోబల్ టౌనూ, గ్లోబల్ సిటీ అనలేదు. అడెందుకు అలా అన్నాడా అని సానాసుట్లు ఆలోసించాను. సివరాకరికి తోచిందే టంటే - ఒరిజినల్‌గా ఆలోసించే సత్తా పల్లెటూరోడికే ఉంది. ఓసుట్టు ఇశాపట్నం ఎల్లాను, ఒహాడు - సదువూ సంధ్యా లేనోడు - డ్రెడ్జర్‌ని తవ్వోడ అంటున్నాడు. సబ్‌మెరీన్ని మునుగోడ అంటున్నాడు. అంటే ఓ కొత్తది చూసి సటుక్కున పట్టేయగల సహజమైన బుర్ర ఇంకా పల్లెల్లోనే ఉందన్నమాట. అదేదో మనసులో ఎట్టుకునే తెల్లోడు గ్లోబల్ విలేజ్ అన్నాడు. అంతెందుకు - ఈ లోకంలో నిప్పూ, చక్రం కనిపెట్టిందెవడు - ఏ లేబరెట్రీలో కనిపెట్టాడు?' అన్నాడు శివుడు.

'నువ్వు కతేదో బానే కట్టావు శివుడూ - సీకట్లో రాయి ఇసిరావు. సూద్దాం. నాకు తోసింది నేను సెప్తాను గాని శివుడూ - మరో డౌటు - సత్యం సెప్పాల. తెలివితేటలు సూపించొద్దు'

'అడుగూ' అన్నాడు.

'మేం పల్లెటూరోళ్ళం. మోటు మడుసులం. అయినా ధర్మం న్యాయం ఆలోసిస్తాం. నువ్వు మాంచి అదేటి - ఇంకుబేటర్లు - సెయ్యగలిగీ - సంటిబిడ్డలనైనా సూడకుండా నాసిరకం సేసావు. తప్పనిపించలేదా శివుడూ'

శివుడు కొంతసేపు మాటాడలేదు.

'నిజమే - బాబాయ్! నా తప్పు కొంతుంది. లంచాలు ఇచ్చేవాడు మప్పాడా - పుచ్చుకునే వాడు మప్పాడా, పైనించి వొచ్చిన తెల్లోడు మప్పాడా - స్వతంత్రం వచ్చాక మనం నేర్చామా - ఏదయితే ఏంటి - అది సరుకు తయారీ ధరలో ఓ భాగమై పోయింది. అదో పాయింటే గాని బాబాయ్ - అసలు విషయం వేరే ఉంది. వస్తువులు కొనేటప్పుడు మన ప్రభుత్వాలు ఏభై ఏళ్ళుగా నాణ్యత మీద దృష్టి చూపించలేదు. దాని వెనక చాలా కథ ఉంది బాబాయ్!' అన్నాడు.

'ఏటి శివుడూ స్టోను మారిపోనాదీ - నువ్వగనక కత ఇలాగెత్తుకున్నావంటే - తెల్లారి పోద్ది. నీ జగన్నాటకంతోనే తల పేలి పోనాది. ఈ దేశవాళీ సోది టపీమని తేలిసెయ్యి.'

'బాబాయ్! దీన్ని మా సర్కిల్స్‌లో ఎల్ వన్ సిండ్రోమ్ అంటాం సరదాగా. వస్తువుల్లో కొన్ని బజారుకెళ్ళి కొంటాం. కొన్ని ఆర్డరిచ్చి చేయించుకుంటాం. వీటిని కస్టమ్ బిల్ట్ అని టైలర్‌మేడ్ అనీ అంటాం. ఇంతకాలం వీటిని ప్రభుత్వ సంస్థలే ఎక్కువగా ఆర్డర్ చేసేవి. వాటికి వాల్యూమ్ తక్కువ - మార్జిన్ ఎక్కువ.

ప్రభుత్వం కొనాలంటే తక్కువ ఖరీదువి మాత్రం కొనాలి. అంటే - అమ్మేవాళ్ళందరూ ఒకే నాణ్యతగల వస్తువు అమ్ముతున్నారని నమ్మి కొనాలన్నమాట. అదీ ఎల్ వన్ సిండ్రోమ్

అంటే'. అని మూడ్ మార్చుకున్నాడు.

'ఇహా జనం. మనాళ్లు బజారుకెళితే సెప్పేదేటి? నాణ్యతా గాడిదగుడ్డూనూ - ఏది నవకో సూపించూ అన్నారు ఇన్నాళ్ళూ. ఇప్పుడు నాణ్యత దరనీ సోకు దరనీ బరాయిం చేందుకు జనం కాడ పింగుంది. అందుకని - నాణ్యత'

'చెయ్యగలిగీ చెయ్యలేకపోయానంటావు–'

'అంతేమరి'

'ఇప్పుడు చేసి కూడా ఈ జగన్నాటకంలో అమ్ముకోలేక దెబ్బ తినేస్తున్నానంటావు.'

శివుడు మాటాడలేదు.

'ఆళ్ళ సరుకుని అమ్ముకోటానికే మన సరుకు కొంటామన్నట్టు నాటకాలాడ తన్నారం టావు. అదన్న మాట జగన్నాటకం. అమ్మో! తెల్లోడి బుర్రే బుర్ర.' అన్నాడు బ్రహ్మ.

దానికీ శివుడు అవునూ - కాదూ అనలేదు.

సరస్వతి మాత్రం పకపకా నవ్వింది.

ఇద్దరూ ఆమె ఏమైనా చెబుతుందా అని చూసారు.

చూసి చూసి బ్రహ్మ అన్నాడు, ' ఏటా ఎర్రి నవ్వు. సెప్పేదేదో సెప్పకూడదా'

'జగన్నాటకం' అంటూ నవ్వు ఆపుకుంది.

'దేన్ని లోతుగా చూసినా మనిషిలో మూడు మొదలవుతాయి. మొదటిది తెలివి. దాన్ని అర్థం చేసుకునే శక్తి దాన్ని తనకు అనుకూలంగా వాడుకోవడం మీదకు మనిషిని మళ్ళి స్తుంది. రెండవది జ్ఞానం. దాన్ని అర్థం చేసుకోవటంతో మొదలుపెట్టి, దానికి సంబంధించిన ప్రతిదాన్నీ ఆకళింపు చేసుకునే దారిలో ముందుకు పోయి, ఎక్కడ మొదలయాడో మరపులోకి జారి, ఇంత విషయం తన స్వంతమైందన్న అహంలో లేదా నిష్క్రియాపరత్వంలో మనిషిని కూరుకుపోయేట్టు చేస్తుంది. మూడవది బుద్ధి. దానిలో న్యాయమేది - అన్యాయమేది, తప్పు ఏది - ఒప్పు ఏది వంటి విలువల నిర్ధారణతో మొదలౌతుంది. దానికి హృదయ స్పందనను ఆధారం చేసుకుంటుంది. అర్థం చేసుకోటానికి తెలివిని, తను అర్థం చేసుకున్న దానిని సరిచూసుకోటానికి జ్ఞానాన్ని అలవరచుకో జూస్తుంది. అయోమయంలో పడినప్పుడల్లా బయటపడడానికి బుద్ధి హృదయ స్పందననే ఆశ్రయిస్తుంది. శివుడు గారూ! మీ ఎలిమెంటు తెలివి. దానికి కనపడిన జగన్నాటకం ఒక పార్శ్వం మాత్రమే. అది మిమ్మల్ని భయపెడు తోంది. మీ ఇంకుబేటర్ల సమస్య ఈ దేశంలోనే ఇంకో ఆర్డరు దగ్గర కూడా రావచ్చు. ఇక్కడి పరిస్థితులు మీకు తెలుసు. దానిలోంచి బయటపడే మార్గాలు మీకు తెలుసు. కనక మీకు భయం కలగదు. మీకిది తొలి అనుభవం. ఇందులోంచి మీరు బయటపడ్డాక జగన్నాటకం మీకింత క్రూరంగా కనపడదు'. అని దుప్పటీ ముఖంమీద తిరిగి కప్పుకుంది సరస్వతి.

'ఎంత లెక్చరు దంచింది సరస్వతి! నీకేమైనా బోధపడిందా శివుడూ' అన్నాడు.

'కూంతంత ఎక్కింది గాని బెమ్మం బాబాయ్ – ఈ తల్లి సల్లగా సూస్తే నన్నిందులోంచి గట్టెక్కించగలదనిపిస్తంది – నువ్వు రికమెండ్ చేయగూడదా బాబాయ్!' అన్నాడు శివుడు ఆశగా.

'ఇదా – పోనీ అడిగి చూద్దాం. తల్లల్లి – ఏద్దైనా సెప్పగూడదంటే మావోడికి'

సరస్వతి పక్కకు తిరిగి పడుకుంది.

'అదేం జెప్పదు గాని మనం ఆలోసిద్దారి' అన్నాడు బ్రహ్మం.

• • •

'సెప్పు బాబాయ్' అన్నాడు శివుడు.

'లంచం మన సొంతమేంగాదుగా! ఆళ్ళు మాత్రం మెయ్యరా?' అన్నాడు బ్రహ్మం.

'ఆళ్ళు మాత్రం మదుసులు కాదా – ఆళ్ళ అవినీతి కొలత తెలుసుకుందారని నెట్లో ఎతికాను. ఆళ్ళు లెక్కలెలా ఏస్తారో తెలదుగాని మనకన్న కాంతంత మెరుగంట. అయినా మన ఎంక్వైరీ న్యూసు ఇంత టపీమని ఆడికి అందేసిందంటే ఇక్కడే దేశభక్తి లేని నా కొడుకెవడో ఉప్పందించాడన్న మాట. ఎందరికాడ ఈ వార్త ఉందో ఏటో లాబం లేదు మరోటి ఆలోచించు.'

'ఈ ఎంక్వయిరీ ఏదో తేలిపోవాలంటావు'–

'మందే తప్పులేదని' అన్నాడు శివుడు.

'ఆసుపత్రిలో ఏదో సత్రకాయగాడిచేత 'నావల్ల తప్పై పోయింద'నిపించేస్తే?'

'పంజెయ్యదు. అది మనిషి లేకుండా పంజెయ్యాల'.

'ఎంక్వయిరీ సేసేదెవడు – ఆపీసరా? డాక్టరా?'

'ఎవడో పొపెసరు. టాటా ఇన్స్టిట్యూట్ అని బెంగుళూరులో ఉంది. అందులో పనంట.'

'ఎలాటోడేటి – ఆరా తియ్యలేకపొయ్యావా' అన్నాడు.

'అదీ అయింది. ఇనీసరికే సెమట్లు పట్టేసాయి. ఆ మహానుభావుడికి ఉన్నయ్యి ఏటంటే సదువు, నిజాయితీ. ఆ రెండూ ఉన్నాయన్న అహం, ప్రాజెక్టులకి సలహాదారుడిగా వచ్చీ పది రూపాయలూ సరిపోద్దన్న తృప్తి, అదే మూలకని నిలదీయని పెళ్ళాం, బగవంతుని మీద అపనమ్మకం, బాబాల మీద అసయ్యం, పరాయి ఆడాళ్ళు సోదరీమణులన్న గుడ్డి నమ్మకం – ఇహ లేనియ్యి ఏటంటే'

'చాలుచాలు శివుడూ! ఆడి అవగుణాల సిట్టా సాలు – ఆలోసించనీ!'

'బాగా ఆలోసించు బాబాయ్ – నీ మీద ఆశ ఎక్కువవుతోంది"

'ఆడు తెలివైనాడు గదా'

'ఆడి శాస్త్రంలో ఆడు చాలా పెద్దాడు.'

'ముల్లుని ముల్లుతోనే తియ్యాల శివుడూ – ఆడి సదువులోనూ తెలివిలోనూ బుర్ర ఎట్టు. నీకు ఏదోదోవ దొరుకుద్ది.'

శివుడు కళ్ళప్పగించి చూశాడు. అతని ముహంలో మారుతున్న రంగులు చూసి బ్రహ్మ అన్నాడు 'నీకు నమ్మకం లేదు గాని శివుడూ – ఇట్టాంటి మడిసితో పంజరగాలీ అంటే నువ్వు డబ్బులు పెట్టో దెబ్బలు కొట్టో – ఆలోసించావనుకో – మొదటికే మోసం వస్తుంది సూసుకో మరి' అన్నాడు.

లేదన్నట్టుగా బుర్ర ఆడించి 'నేనొస్తాను బాబాయ్ – నువ్వు ఏదైనా పుట్టిస్తావు. నేను దాని తుదముట్టొస్తాను. బాగా అలోసించనీ' అని బయలుదేరాడు.

ఆగి 'సూడు సరస్వతమ్మా! కడుపుకి సూసుకోటం మడిసి ధర్మం. ఇప్పుడు గ్లోబలైజేషన్ వచ్చేసింది. దీంతో ఎలా నెగ్గుకురావాల అని సూడాల గాని ఇది మంచా చెడ్డా అని తటపటాయించావంటే నువ్వు ఎనకబడి పోతావు. ఇక్కడ దెబ్బ తినీస్తే ఇంకోసోట లెగాల. వస్తా!' అని మళ్ళీ ఆఘమూ మేఘమూ ఎక్కి హైదరాబాదు వెళ్ళిపోయాడు.

• • •

వారం తిరక్కుండా తిరిగి వచ్చాడు శివుడు.

'వస్తూనే ఏది నా మందు ఏది నా విందు' అంటూ కదం తొక్కాడు.

గ్లాసు నింపి చేతికిచ్చి 'సెప్పు' అన్నాడు బ్రహ్మ.

'లోకంలో విష్ణుమూర్తులు ఎందుకుంటారు – మనకి అలవిగాని పని సేసిపెట్టడానికేగదా – భస్మాసురుడు నెత్తి మీద శివుడు సెయ్యి ఎట్టించలేక విష్ణుమూర్తిని పట్టాడు. నేనూ ఆ పనే సేసాను. ఆయన మొత్తం స్పెసిఫికేషన్ చదివాడు. చదివి చదివి చిన్నదోవ కనిపిస్తోంది శివుడూ – అన్నాడు. నువ్వు దాన్ని ఎలా వాడుకుంటావో మరి – అన్నాడు. చెప్పు చెప్పు అన్నాను.' అంటూ పక్కకి చూసాడు.

'సరస్వతా – ఇక్కడే ఉంది – సెప్పు'.

'ఈ స్పెసిఫికేషన్‌లో ఇంకుబేటరుకి కావలసిన కరెంటు ఫ్రీక్వెన్సీ టాలరెన్సు రాసాడు. మన ఎలక్ట్రిసిటీ బోర్డు ఇవ్వగల కరెంటు ఫ్రీక్వెన్సీకి టాలరెన్స్ వాళ్ళిచ్చారు. ఈ రెంటి మధ్యా తేడా ఉంది. చూడూ – అన్నాడు. చూసాను. మన వస్తువుకి కనీసం అవసరమైందాని కన్న వాళ్ళు మాగ్జిమమ్ ఇవ్వగలిగింది తక్కువ. ఇంకేముంది – పెద్దాయన ముందు నిలబడ్డాను. నేనూ తెలివైనోణ్ణే గాని నీ తెలివి ముందు బలాదూరు అన్న కలరిచ్చాను. మూడు గంటలసేపు

ప్రశ్నలు ఏసీ ఏసీ అలిసిపోయిదాకా మాటాడనిచ్చాను. ఆ తర్వాత ఈ ఫ్రీక్వెన్సీ తేడా మాటేటి అని అమాయకంగా అడిగాను. రెండు నిమిషాలు ఏటీ మాటాడలేదు. మన ఇంకు బేటరు అప్పుడప్పుడు తప్పుగా పనిచెయ్యటానికి కారణం అదేనని రాసేసాడు. స్పెసిఫికేషన్ సరిచెయ్యాల్సిందనీ, ఇంకుబేటర్లన్నీ వాపసు తీసుకుని కొత్త స్పెసిఫికేషను ప్రకారం చెయ్యించాలని రికమెండు చేసాడు.'

'సెబాస్' అన్నాడు బ్రహ్మ.

'చూసారా శివుడు గారూ - మీరు ఒక ఎంటర్‌ప్రీనర్. తెలివైన వారు. రిస్కుకి భయపడకుండా కొత్తకి సంకోచించకుండా నడిచే ఉత్సాహవంతులు. మంచి సమాజాలలో మీ పాత్ర చాలా ముఖ్యమైనది. మీ చిన్ని సమస్య పరిష్కారమైంది. మరో సమస్య వచ్చేవరకూ ఇహ జగన్నాటకం మీకు కనబడదు. కానీ ఆలోచించండి. వాళ్ళు మీ సరుకుని అడ్డరు, చిట్టిపొట్టి సమస్యలు పెడతారు. మీరు చేసేది అమ్ముకోటానికీ, మీక్కావలసింది వాళ్ళు మీకు అమ్మటానికి కూడా వాళ్ళిలాంటివి పెడతారు. ఎందుకని? మీరు వాళ్ళమీద ఆధారపడి ఉన్నారని గుర్తు చెయ్యటానికి. అదెందుకంటే పెట్టుబడికి మీ మీద అంటే మీ దేశాల మీద పెత్తనం కావాలి. ఆ పెత్తనంతో అదేం చేస్తుంది? పదహారో శతాబ్దం నుంచి ఎల్లలు దాటిన పెట్టుబడికి ఈరోజున కావలసింది చవక చెమట. మీబోటి వాళ్ళ తెలివి. అదీ ఒకరకంగా చెమటే. అది మీ దేశం అందిస్తుంది. దానికోసమే రాజకీయంగా స్వతంత్రమైన భూభాగాలు - దేశాలన్న పేరుతో - అది చెప్పే అభివృద్ధి ఎండమావి వెనక పరుగెడుతూ - తమ జనం చెమటను అమ్ముకోటానికి కాలవలు నిర్మిస్తూ దానికి అడ్డుపడే వాళ్ళను అదుపుచేస్తూ కీలుబొమ్మలై ఆడటమే అసలు నాటకం. ఈ చెమట దుకాణాల జగన్నాటకం మీకు కనబడదా? కనబడుతుందని కళ్ళు మూసుకుంటున్నారా?'

అని సరస్వతి దుప్పటి కప్పుకుంది.

■